కాంగ్రెస్, బీజేపీకి ఓటేసి మరోసారి మోసపోవద్దు

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



భారీ గజమాలతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

సనత్‌నగర్: కాంగ్రెస్, బీజేపీలకు ఓటేసీ మరోసారి మోసపోవద్దని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. సికింద్రాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌తో కలిసి సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని పాటిగడ్డ, ఎస్‌బీటీనగర్, వికార్‌నగర్, వడ్డెరబస్తీ, తబేలా తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి ఆధ్వర్యంలో వారికి క్రేన్ సహాయంతో భారీ మాలలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎవరికి ఓటు వేస్తే మేలు జరుగుతుందో ఆలోచించి ఓటేయాలని పిలుపునిచ్చారు. ఎంపీగా గెలిపించిన కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రిగా ఉండి కూడా నియోజకవర్గ ప్రజలకు ఏమీ చేయలేదని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ హామీలను అమలుచేయకుండా ప్రజలను నమ్మించి మోసం చేసిందని ధ్వజమెత్తారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే పద్మారావుగౌడ్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో మేడే రాజీవ్‌సాగర్, శ్రీహరి, శ్రీనివాస్‌గౌడ్, ఆరీఫ్, శేఖర్‌ముదిరాజ్, అఖిల్ అహ్మద్, అక్బర్, అజ్మత్, శ్యాంసుందర్, నధీమ్, నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.

అడ్డగుట్ట: రైల్వే కార్మికుల పక్షాన వారి గళాన్ని పార్లమెంట్‌లో వినిపిస్తానని సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ పేర్కొన్నారు. గురువారం లాలాగూడలోని రైల్వే వర్క్‌షాప్ వద్ద కార్మిక సంఘాలతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. రైల్వేలో ప్రైవేటీకరణ వల్ల కార్మికుల ప్రయోజనాలు దెబ్బతింటున్నాయన్నారు. పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలనే డిమాండ్‌కు తాము మద్దతు తెలుపుతామన్నారు.

శాసనసభ్యుడిగా, రాష్ట్ర మంత్రిగా, డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరించిన దశల్లో కార్మికులకు అందుబాటులో నిలిచానని, ఎంపీగా అవకాశం కల్పిస్తే వారి శ్రేయస్సుకు పాటు పడతానని అన్నారు.

అందుబాటులో ఉంటా గెలిపించండి..

లాలాపేట: సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ గురువారం మాణికేశ్వర్‌నగర్‌లో ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటాను తనను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సికింద్రాబాద్ అసెంబ్లీలో ఏ విధంగా అభివృద్ధి చేశానో అదే విధంగా సికింద్రాబాద్ పార్లమెంట్ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

లాలాగూడలో ప్రచారం..

అడ్డగుట్ట: పద్మారావుగౌడ్‌కు మద్దతుగా గురువారం లాలాగూడ బడీ మసీద్, శేషామహాల్, శాంతినగర్ పరిసర ప్రాంతాల్లో కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మీ ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్, బిజేపీ పార్టీలు అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని, అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగిన బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ప్రచారంలో లింగాని శ్రీను, శ్రీనివాస్‌గౌడ్, నక్క మధు, మనోహర్, అమర్, రాజు, ఎల్లయ్య, మహ్మద్, వసంత, గౌస్, హాషం, జావీద్, కుమార్, ఇస్మాయిల్, శ్రీరామ్, దేవయ్య పాల్గొన్నారు.

చలివేంద్రాలతో బాటసారులకు ఉపశమనం

జీఎం వినోద్‌కుమార్



చలివేంద్రాలను తనిఖీ చేసిన జీఎం వినోద్‌కుమార్

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో జలమండలి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను గురువారం జీఎం వినోద్‌కుమార్ పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏ విధంగా పని చేస్తున్నాయి. అదే విధంగా ప్రజలు వీటిని ఎలా ఉపయోగించుకుంటున్నారు అనే విషయాలను పరిశీలించారు. ప్రధాన రహదారులు, రోడ్ల పక్కన జలమండలి ఎంతో వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలు బాటసారులు, ప్రజలకు ఏ విధంగా అందుబాటులో ఉన్నాయి వాటిపై ఆరా తీశారు. తార్నాక, సికింద్రాబాద్, బోయిగూడ, పద్మారావునగర్ తదితర ప్రాంతాల్లోని చలివేంద్రాలను జీఎం వినోద్‌కుమార్ ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. మండుతున్న ఎండల నేపథ్యంలో జలమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాలు ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయన్నారు.

'బాల్య వివాహాలు అరికట్టాలి

అడ్డగుట్ట: బాల్య వివాహాలు అరికట్టేలా ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని తెలంగాణ తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం మారేడుపల్లి మండల కార్యాలయం వద్ద బాలల హక్కుల పరిరక్షణ వేదిక, తల్లుల సంఘం, ఎంవీ ఫౌండేషన్, అశ్రిత ఎన్‌జీవోల ఆధ్వర్యంలో 'బాల్య వివాహాల రహిత భారత్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేయడం చట్టరిత్యా నేరమని అలాంటి వివాహాలను ప్రోత్సహిస్తే నేరస్తులవుతారన్నారు. బాల్య వివాహాల సమాచారం తెలిస్తే వెంటనే 1098, 100, 112 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రతినిధులు లక్ష్మీనారాయణ, ప్రవీణ్, రామలీల, ప్రకాష్, శోభ, జేనీష్, సువర్ణ, భగ్య, మమత, అక్షయ్, జగన్, రెమిడియల్ సెంటర్ల టీచర్లు సుమలత, లావణ్య, సౌజన్య, క్రాంతిరేఖ పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్వచ్ఛంద సంస్థల సభ్యులు

అమ్మకానికి కన్నపేగు?

స్వచ్ఛందంగా ఇచ్చానన్న తల్లి



గాంధీఆస్పత్రి: పోషించే స్థోమత లేక కన్న బిడ్డను అమ్మకానికి పెట్టింది ఓ తల్లి. గమనించిన గాంధీ సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. గాంధీ ఆస్పత్రి మెట్రో స్టేషన్ ఫుట్‌పాత్‌పై నివసిస్తున్న కవిత యాచకురాలు. నిండు గర్భిణి అయిన ఆమెను ముషీరాబాద్ భోలక్‌పూర్‌కు చెందిన అతియా సుల్తానా, మతియా సుల్తానా అనే మహిళలు చేరదీసి గత నెల 24న ఆస్పత్రిలో చేర్పించారు. మరుసటి రోజు కవిత మగశిశువుకు జన్మనిచ్చింది. పుట్టిన శిశువును తమతో తీసుకెళ్లేందుకు అతియా సుల్తానా, మతియా సుల్తాన యత్నించగా గమనించిన సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. పోలీసులు ఇరువురు మహిళలకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. అప్పటి నుంచి సదరు మహిళలే బాలింత కవితకు అన్ని సపర్యలు చేస్తున్నారు. గురువారం మరోసారి ఎంసీఐ వార్డు నుంచి మగ శిశువును తమ వెంట తీసుకువెళ్లేందుకు మహిళలు యత్నించారు. శిశువును రూ. 25 వేలకు విక్రయించినట్లు కలకలం చెలరేగడంతో అప్రమత్తమైన సెక్యూరిటీ సిబ్బంది ఇరువురు మహిళలను అడ్డుకున్నారు. తాము శిశువును కొనుగోలు చేయడం అనేది అబద్ధమని, నిండు గర్భిణి కవితకు ఆస్పత్రిలో చేర్పించి సహాయసహకారాలు అందించామని, యాచకురాలైన తాను శిశువుకు పెంచే స్థోమత లేదని చెబుతూ.. తాము శిశువును పెంచుకునేందుకు తల్లి కవిత స్వచ్ఛందంగా ఒప్పుకుందని సదరు మహిళలు సెక్యూరిటీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు సూచన మేరకు శిశువును పీడియాట్రిక్ ఇన్సెంటివ్ కేర్ యూనిట్ (పీఐసీయూ)కు తరలించి తల్లి కవితను డిశ్చార్జి చేశారు.

సానుభూతితో అభివృద్ధి జరగదు



కంటోన్మెంట్: సానుభూతితో అభివృద్ధి జరగదని కంటోన్మెంట్ బీజేపీ అభ్యర్థి డాక్టర్ వంశ తిలక్ అన్నారు. గురువారం కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు రామకృష్ణ, ఇతర బీజేపీ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్, ప్రస్తుతం అధికార పార్టీ కాంగ్రెస్‌లో కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో గెలుపు కోసం ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ విపరీతంగా డబ్బులు పంచుతోందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత హఠాన్మరణం పట్ల తాను కూడా వ్యక్తిగతంగా సానుభూతి చెబుతున్నానని అన్నారు. అయితే కేవలం సానుభూతితో అభివృద్ధి జరగదన్నారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇస్తామని దివంగత ఎమ్మెల్యే లాస్య నందిత రూ.2 కోట్ల మేరకు డబ్బులు వసూలు చేశారని ఆమె అనుచరులే ధర్నాకు దిగారని అన్నారు. ప్రస్తుతం ఆమె స్థానంలో పోటీ చేస్తున్న లాస్య సోదరి నివేదిత ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ నేతలు ఓటర్లకు డబ్బులు పంచుతున్నారని, ఆ సొమ్మంతా ప్రజాధనమే అన్నారు. కంటోన్మెంట్‌లో బీజేపీ ద్వారానే అభివృద్ధి జరిగిందని బోర్డు సభ్యుడు రామకృష్ణ అన్నారు.

కుల రాజకీయాలు చేసే కిషన్‌రెడ్డిని ఓడిస్తాం



ఆదం సంతోష్‌ను కలిసి కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటిస్తున్న మాల సంఘాల నాయకులు



ప్రచారంలో పాల్గొన్న కోట నీలిమ

సికింద్రాబాద్: మాలలు, మాదిగల మధ్య చిచ్చు పెడుతూ కుల రాజకీయాలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందేందుకు యత్నిస్తున్న సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డిని ఓడిస్తామని మాల సంఘాల జేఏసీ చైర్మన్ రాంచందర్, బేల బాలకిషన్ ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదం సంతోష్‌కుమార్‌తో కలిసి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముస్లింలు, క్రైస్తవులు, ఆదివాసీలపై దాడులు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రవి, అనిల్‌కుమార్, సత్యనారాయణ, నాను, రవి పాల్గొన్నారు.

దానంకు మద్దతుగా ..

లాలాపేట: సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి బరిలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. లాజరస్, శ్రీనివాస్, లింగయ్య, మాటియా, రవి, వెంకటేష్, తులసీరామ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

పద్మారావునగర్: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ, డాక్టర్ రవీందర్ గౌడ్ అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్ పరిసర ప్రాంతాల్లో గురువారం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరు పట్ల స్పందన లభిస్తుందన్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపి మోసం చేశారన్నారు. లోకసభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను చిత్తుగా ఓడించాలని కోరారు. చిరంజీవి, క్రిష్ణ, డాక్టర్ శివకుమార్ లాల్, వేదప్రకాష్, శ్రావణ్, మోహన్, లవా, నస్రీన్ బేగం, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ ప్రచారంలో కీర్తి అనే యువతికి తలకు గాయమై మూడు కుట్లు పడ్డాయి. అయితే.. మహిళా కార్యకర్తకు గాయమైనా ఏ ఒక్కరూ పట్టించుకోకపోవడంతో కొందరు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం

పర్యావరణ స్పృహను పెంచేందుకు పీసీబీ కీలక నిర్ణయం

సనత్‌నగర్: ప్రజల్లో మరింతగా పర్యావరణ స్పృహను కలిగించేందుకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీఎస్‌పీసీబీ) మరో కీలక నిర్ణయం తీసుకుంది. యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించాలనే యోచనకు వచ్చిన పీసీబీ అధికారులు..ఆ ఛానల్‌లో అప్‌లోడ్ చేసేందుకు రూపకర్తల నుంచి లఘు చిత్రాలు, సందేశాత్మక వీడియోలను ఆహ్వానిస్తోంది. వ్యక్తిగత, కమ్యూనిటీస్, ఎన్‌జీఓస్, పారిశ్రామిక, వ్యాపార సంస్థలతో ప్రమోట్ చేయబడే షార్ట్ ఫిల్మ్, వీడియోలను ఆహ్వానించి ఉత్తమ వీడియోలకు రివార్డు అందించనున్నారు. శుభ్రత, ఆరోగ్యం, ప్రకాశవంతమైన సమాజం కోసం పర్యావరణ నిర్వహణ అంశంపై ఆయా వీడియోలకు రూపకల్పన చేయాల్సి ఉంటుందని పీసీబీ సీనియర్ సామాజిక శాస్త్రవేత్త ప్రసన్నకుమార్ తెలిపారు. రాష్ట్రంలోని పర్యావరణ కమ్యూనికేషన్ ఔత్సాహికులు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే వీడియోలను సిద్ధం చేయాలని మరిన్ని వివరాలకు 990817967, 9177303127 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

పోలింగ్ పెంపుపై అవగాహన

కంటోన్మెంట్: ఓటుతోనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని ఆర్‌టీఐ కార్యకర్త, న్యాయవాది నరేశ్ యాదవ్ అన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా తమవంతు ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నరేశ్ యాదవ్ మాట్లాడుతూ.. 2023 ఎన్నికల్లో కంటోన్మెంట్‌లో 50 శాతం కూడా పోలింగ్ దాటలేదని ఈ నేపథ్యంలో తాము ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగేలా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. రమేశ్ కుమార్, క్రాంతికార్, వెంకటేశ్, పసువుల సాయి నిఖిల్ పాల్గొన్నారు.

ఈటలకు మద్దతుగా ప్రచారం

రసూల్‌పురా: బీజేపీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా రెండవ వార్డు శివనగర్‌లో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సదా కేశవరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ మహిళా మోర్చా నాయకులు గురువారం ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కమలం పువ్వు గుర్తుపై ఓటేసి వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫాతిమా, శ్యామల, శ్రీమతి, కమల, లక్ష్మి, రేఖ తదితరులు పాల్గొన్నారు.

గౌడ్‌ల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న అనిల్ కుమార్ యాదవ్

కంటోన్మెంట్: గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షులు పల్లె లక్ష్మణ్ రావు గౌడ్ అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న అనిల్ కుమార్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. జంట నగరాల్లోని కల్లు దుకాణాల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. పల్లె లక్ష్మణ్ రావు గౌడ్ లాంటి నాయకుడి ఆధ్వర్యంలో గౌడ కులస్తుల సమస్యలన్నింటికీ త్వరలోనే పరిష్కారం లభిస్తుందన్నారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్, ఎంపీ ఎన్నికల్లో సునీతా రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు. పల్లె లక్ష్మణ్ రావు గౌడ్ మాట్లాడుతూ.. కులం కోసం 40 ఏళ్లుగా సేవలందిస్తున్నానని కాంగ్రెస్ ప్రభుత్వం గౌడ్‌లకు అండగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బద్దం ధనుంజయ్ గౌడ్, దేవేందర్ గౌడ్, నోముల సిద్దు గౌడ్, ప్రభు గౌడ్, సత్యనారాయణ గౌడ్, బాలరాజ్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

సికింద్రాబాద్: వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి చెందారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం..చర్లపల్లికి చెందిన మహ్మద్ సర్వర్‌పాష (55) రైల్వే ఉద్యోగి. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో షంటింగ్ డ్యూటీ చేస్తున్న క్రమంలో పట్టుతప్పి కిందపడి పోయాడు. అదే సమయంలో పక్క ట్రాక్‌పై వస్తున్న లైట్ ఇంజిన్‌కు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

స్టేషన్‌లో ప్రయాణికుడు..

రైల్వేస్టేషన్‌లోని డార్మిటరీ వద్ద ఒక వ్యక్తి అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు బాధితుడిని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మృతుడు అల్వాల్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి కిషోర్‌కుమార్‌రెడ్డి (50)గా గుర్తించారు.

రైలుబోగీలో మరొకరు..

లాలాగూడ వాషింగ్‌యార్డులో సర్వీసింగ్ కోసం వెళ్లిన రైలుబోగీలో వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని బట్టి ఐదారు రోజుల క్రితమే మృతి చెందినట్టు పోలీసులు నిర్ధారించారు.

గృహిణి అదృశ్యం



సుష్మిత

అడ్డగుట్ట: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ గృహిణి అదృశ్యమైన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ అమర్‌సింగ్ వివరాల ప్రకారం. ఒరిస్సాకు చెందిన జగన్నాథ్ నాయక్‌కు ఏడాది క్రితం సుష్మిత(19)తో వివాహం జరిగింది. ఇటీవల నగరానికి వచ్చిన భార్యాభర్తలు నెల రోజుల నుంచి లాలాపేటలోని లక్ష్మీనగర్ ప్రాంతంలో ఇల్లు అద్దెకు తీసుకొని నివాసముంటున్నారు. అయితే.. ఈ నెల 6న ఉదయం భర్త పనికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూలేని సమయంలో సుష్మిత బయటకు వెళ్లింది. ఉద్యోగం ముగించుకొని ఇంటికొచ్చిన భర్తకు సుష్మిత కనిపించకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తెలిసిన వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కిషన్‌రెడ్డి ఎన్నికల ర్యాలీ



ర్యాలీలో అభివాదం చేస్తున్న కిషన్‌రెడ్డి

లాలాపేట/చిలకలగూడ: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గురువారం సికింద్రాబాద్ నియోజకవర్గంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. లాలాపేట ఇసుకబాయి బస్తీ నుంచి ప్రారంభమైన ర్యాలీ లాలాపేట నుంచి తార్నాక, మెట్టుగూడ, వారిసిగూడ, చిలకలగూడ వరకు కొనసాగింది. ర్యాలీలో బండా కార్తీకరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, మేకల సారంగపాణి, రాము, వెంకటేష్‌గౌడ్, వీరన్న, పోచయ్య యాదవ్, శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.



ఎమ్మార్పీఎస్ ప్రచారం..

అడ్డగుట్ట: సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం అడ్డగుట్టలోని ఆజాద్ చంద్రశేఖర్ నగర్, శాస్త్రినగర్, వెంకట్‌నగర్లలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు మాదిగ, ఉపకులాలు అందరూ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో డప్పు మల్లికార్జున్, కొమ్ము శేఖర్, సాయికుమార్, మహేష్, రాజు, శ్యామ్, కొమురయ్య, గౌరయ్య, రవి పాల్గొన్నారు.